క్లుప్తంగా

జీవాలకు టీకాలు



పాన్‌గల్: మండలంలోని దావాజిపల్లి, దొం డాయిపల్లి గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ ఆధ్వ ర్యంలో గొర్రెలు, మేకలకు గురువారం పాటు రోగం టీకాలు వేసినట్లు మండల పశువైద్యా ధికారి డా.శ్యాం తెలిపారు. వర్షాకాలం ప్రారం భంలో లభ్యమయ్యే పచ్చిమేత వల్ల జీవాల్లో పాటు రోగం సోకి మరణాలు సంభిస్తాయ న్నారు. టీకాలు వేయించుకొని జీవాలను రోగాల నుంచి కాపాడుకోవాలన్నారు. గొర్రెల కాపారులు తమ జీవాలకు టీకాలు వేయిం చాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది బుచ్చన్న, కుర్షీద్‌అలీ, చంద్రయ్య, గొర్రెల కాపారులు పాల్గొన్నారు.

జూన్ 23న రాష్ట్రస్థాయి డ్యాన్స్ పోటీలు



అమరచింత: ప్రత్యూష డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్, అనిల్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో జూన్ 23న రాష్ట్ర స్థాయి డ్యాన్స్ పోటీలను అమరచింతలో ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు చిన్న, సూరి, భరత్ తెలిపారు. ప్రత్యూష డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్ 15వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని రాష్ట్ర స్థాయి డ్యాన్స్ పోటీ లకు సంబంధించిన ఆహ్వాన పత్రికను టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్ చేతుల మీదుగా గురువారం విడుదల చేశారు. ఆసక్తి గల డ్యాన్స్ గ్రూప్‌లు సెల్ నంబర్ 95424 04616, 73862 70804, 98854 36762 లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని కోరారు. ప్రతిభ కనపర్చిన వారికి నగదు బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు.

'ఆశాల సమస్యలు పరిష్కరించాలి'



కొత్తకోట: ఆశా కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆశా కార్యకర్తల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.సు నీత కోరారు. గురువారం పట్టణంలో జరిగిన ఆశా కార్యకర్తల సమావేశానికి ఆమె ముఖ్యఅ తిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా చాలీచాలని వేతనంతో పని చేస్తున్నామని.. తమ శ్రమను ప్రభుత్వాలు దోపిడీ చేస్తు న్నాయని ఆరోపించారు. ఆశాల నియామకా నికి నిర్వహించే పరీక్షను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పల్స్‌పోలియో కార్యక్రమంలో పాల్గొన్న ఆశ కార్యకర్తలకు ప్రభుత్వం నేటికీ డబ్బులు చెల్లించలేదని.. వెం టనే విడుదల చేయాలన్నారు. అలాగే పెండిం గ్‌లో ఉన్న లెప్రసీ సర్వే డబ్బులు, ఒక నెల వేతనం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్, సం ఘం జిల్లా ఉపాధ్యక్షురాలు జె.భాగ్య, మండల నాయకులు మంజుల, రజిత, వరలక్ష్మి, చంద్ర కళ, శ్వేత, కాంచన, పుష్ప, పద్మ, పావని, వెం కటేశ్వరమ్మ తదితరులు ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి



పాన్‌గల్: పేదల పక్షాన ఉంటూ వారి సమ స్యల పరిష్కారమే ధ్యేయంగా ఉద్యమిం చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురు వారం మండల కేంద్రంలోని పార్టీ కార్యా లయంలో భగత్ అధ్యక్షతన జరిగిన మండల స్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజలను చైతన్యం చేస్తూ వారి సమస్యలు తెలుసుకొని పరిష్కారం కోసం అధికారులపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ప్రజా సమ స్యలపై పోరాటాలు సాగించేలా కార్యకర్తలను చైతన్యం చేసేందుకు శిక్షణ తరగతులు నిర్వహి స్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజ లకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించా లని, అన్నిరకాల వరి ధాన్యానికి బోనస్ చెల్లిం చాలని పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బాల్యానా యక్ డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు వెంకటయ్య, ఆంజనేయులు, రాము, కె.వెంకటయ్య, జమ్ములయ్య, పరశు రాములు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ చేపట్టాలి

పెంట్లవెల్లి: మండలంలోని కొనుగోలు కేంద్రా లలో వరి కొనుగోలు ధాన్యాన్ని వేగవంతం చేయాలని తహసీల్దార్ హిమబిందు గురు వారం పలు కొనుగోలు కేంద్రాలు ఆమె తనిఖీ చేశారు. ప్రతి రైతు వద్ద ధాన్యాన్ని పరీక్షించి కొనుగోలు చేయాలని సూచించారు. ప్రతి విషయం ఆన్‌లైన్‌లో, రికార్డుల్లో భద్రపర్చాలని వారికి తెలియజేశారు.

'హైటెన్షన్' ఇబ్బందులు ఎన్నాళ్లు?

- ప్రమాదకరంగా 11కేవీ విద్యుత్ లైన్
- ఆదమరిస్తే ప్రమాదకమే
- ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు



ఇళ్లపై విద్యుత్ తీగలు



శ్రీకృష్ణానగర్‌లో ఇళ్ల మధ్య 11 కేవీ విద్యుత్ లైన్

అమరచింత: పట్టణంలోని శ్రీకృష్ణనగర్‌లోని కాశీకా లయం సమీపంలోని 11 కేవీ విద్యుత్ లైన్ ద్వారా కాలనీ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడు తున్నా సంబంధిత ట్రాన్స్‌కో అధికారులు పట్టించు కోవడం లేదు. 30 ఏళ్ల నుంచి తమ ఇళ్లపై వెళ్తున్న 11 కేవీ విద్యుత్ తీగలను మార్చాలని అధికారులు, ప్రజాప్రతినిధులను కోరినా పట్టించుకోకపోవడం తో సమస్య మరింత జటిలంగా మారింది. అమర చింత మున్సిపాలిటీగా రూపాంతరం అయిన తమ కాలనీ సమస్యను ఏమాత్రం పరిష్కరించట్లేదని, వైర్లు మార్చకుంటే ఎప్పుడు ఏ ప్రమాదం సంభవి స్తుందోననే భయంతో కాలం గడుపుతున్న పరిస్థి తులు దాపరించాయని ప్రజలు వాపోతున్నారు.

50 ఇళ్ల మీదుగా..

తమ కాలనీలోని 50 ఇళ్ల మీదుగా వెళ్తున్న 11 కేవీ వ్యవసాయ విద్యుత్ లైన్‌ను మార్చాలని పలు సంద ర్భాల్లో ట్రాన్స్‌కో అధికారులను పట్టణ ప్రగతి కార్య క్రమాల్లో నిలదీసిన దాటవేసే ధోరణితో సమా ధానం చెప్తున్నారే తప్పా.. శాశ్వతంగా విద్యుత్ లైన్ మార్చేందుకు మున్సిపల్ పాలక వర్గం మొగ్గు చూపట్లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో కాలనీవాసులు నిత్యం ప్రమాదకర విద్యుత్ తీగల మధ్య తమ బతుకులను కొనసాగిస్తున్నారు.

రూ.18 లక్షల ప్రతిపాదనలు

శ్రీకృష్ణనగర్‌లోని కాశీకాలయం నుంచి గొల్ల పెద్ద బుచ్చన్న ఇంటి నుంచి వెళ్తున్న 11 కేవీ విద్యుత్ తీగ లను మార్చేందుకు ట్రాన్స్‌కో అధికారులు సుమారు రూ.10 నుంచి 11 లక్షల అంచనాలు వేసి మున్సిపల్‌కు నివేదించారు. మున్సిపల్ పాలక వర్గం వీటిపై అధ్యయనం చేస్తూ మొత్తంగా రూ.18 లక్షలు మంజూరు చేస్తే శాశ్వతంగా సమస్యను పరి ష్కరించే అవకాశం ఉందని ప్రతిపాదనలు సిద్ధం చేసి కలెక్టర్‌తో పాటు ట్రాన్స్‌కో సీఎండీకి పంపారు. ప్రతిపాదనలు పంపిన నేటికీ నిధులు మంజూరు కాకపోవడంతో విద్యుత్ లైన్ మార్చే ప్రయత్నా లను చేపట్టట్లేదు. మున్సిపాలిటీలో సొంత నిధులు లేకపోవడంతో సమస్యను మరుగున పడేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరి ష్కరించాలని కోరుతున్నారు.

భయం భయంగా..



తమ కాలనీలో 11 కేవీ విద్యుత్ తీగలు ఇళ్ల మధ్య ఉన్నందున ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుం దోననే భయంతో బతుకుతు న్నాం. పట్టణ ప్రగతి కార్యక్రమాల్లో భాగంగా అధికారులకు సమస్యను విన్నవించినా ఫలితం లేదు. 11 కేవీ విద్యుత్ లైన్ ద్వారా 50 కుటుంబాల భయాందోళనల మధ్య జీవనం సాగిస్తున్నారు.

– చింతకుంట వెంకటేష్, అమరచింత

ఉన్నతాధికారులకు నివేదించాం



11 కేవీ విద్యుత్ లైన్‌ను మార్చాలని ట్రాన్స్‌కో అధికారు లతో కలిసి మొత్తంగా రూ.18 లక్షలతో ప్రతిపాదనలు తయారు చేసి కలెక్టర్, ట్రాన్స్‌కో ఉన్నతాధి కారులకు పంపాం. ఇప్పటి వరకు నిధులు మం జూరు కాలేదు. ప్రభుత్వ మార్పుతో మరోమారు ప్రతిపాదనలను ఎమ్మెల్యే, కలెక్టర్‌కు నివేదించి సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటాం.

– మంగమ్మ, మున్సిపల్ చైర్‌పర్సన్, అమరచింత

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం



మాట్లాడుతున్న వైద్యులు డా.హరినాథ్‌రెడ్డి

పాన్‌గల్: వర్షాకాలం సీజన్ ప్రారంభమవుతున్న కారణంగా సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలను చైతన్యం చేస్తూ సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉం డాలని పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సం దర్భంగా గర్భిణులు, బాలింతల ఆరోగ్య విష యాలు, కాన్పుల సంఖ్య, టీబీ, లెప్రసీ, ఆయు ష్మాన్ భారత్ ఆరోగ్య కార్డుల నమోదు తదితర అం శాలపై ఆరా తీశారు. ప్రతి కాన్పు పీహెచ్‌సీలో చేసేలా చూడాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకునేలా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. సిబ్బందికి కేటాయించిన గ్రామాల్లో అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని, విధులపై అలసత్వం వహించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసే వివరాలను పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. సమావేశంలో ఎంఎల్ హెచ్‌పీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మల్లాపురంలో భక్తిశ్రద్ధలతో కలశ పూజ



కలశ పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు



శ్రీఆంజనేయస్వామి మూలవిరాట్

ఆత్మకూర్: లక్ష్మీనర్సింహాస్వామివారి కల్యాణోత్స వంలో భాగంగా గురువారం నవ కలశాలతో స్వామివారికి అభిషేకం, పాలకుల పూజలను భక్తిశ్ర ద్ధలతో నిర్వహించారు. ఆత్మకూర్ శివారులోని మల్లాపురం శ్రీఆంజనేయస్వామి, శ్రీలక్ష్మీనర్సింహా స్వామి ఆలయం వద్ద ప్రముఖ వేదపండితులు శ్రీనివాసరాఘవన్, వెంకటశేషశర్మ, కిషోర్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం హోమం, పుణ్యాహావాచనము, విశ్వక్‌సేవ, ఆరా ధన, పల్లకీసేవ, ఎదుర్కోళ్లు, గరుడ ధ్వజారోహణ, యువతి, యువకుల కల్యాణపూజ, ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తా మన్నారు. ఈసందర్భంగా భక్తులకు తీర్థప్ర సాదాలు, అన్నదానం ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజ యవంతం చేయాలని కోరారు.

సత్యనారాయణకు ఘన నివాళి



వనపర్తిలో సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పెబ్బేరు రూరల్: వనపర్తి జిల్లా కేంద్రంలోని సీఐ టీయూ కార్యాలయంలో గురువారం కార్మిక నాయ కుడు సత్యనారాయణ తొమ్మిదో వర్ధంతిని సీఐ టీయూ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సీఐ టీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు పలు వురు కార్మికులతో కలసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితాంతం కారి ్మక శ్రేయస్సు కోసం పరితపించారని కొనియాడారు. బొగ్గు గని కార్మికుడిగా జీవితం ప్రారంభించి, బొగ్గు గని కార్మికుల హక్కుల సాధన కోసం కార్మిక సం ఘం ఏర్పాటు వారి హక్కుల సాధన కోసం ఉద్య మించారు. కార్మికుల కోసం పూర్తి కాలం శ్రమించా రన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గంధం మదన్, నందిమల్ల రాములు గట్టయ్య, రవి, మన్యం, బాలకృష్ణ, పార్వతమ్మ, వినీల, భాగ్యలక్ష్మి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అంజనగిరిలో..

వనపర్తి మండలంలోని అంజనగిరికి చెందిన మేకల జయరాములు అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి స్థానిక నాయకులతో కలిసి గురువారం గ్రామంలో మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పగిడాల శ్రీనివా స్‌రెడ్డి, శంకర్‌నాయక్, కౌన్సిలర్ బ్రహ్మంచారి, తిరు పతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



కోయిల్‌కొండ: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు ఇచ్చిన గడువులోగా పూర్తిచేయాలని ఏఎంఓ దుంకుడుశ్రీని వాస్ అన్నారు. గురువారం మండలంలోని జయన గర్‌తండా, పల్లుతండా, బోడోనిగుట్టతండా, వర్దన్ పల్లితండా, కేశ్వాపూర్‌తండాలలోని ప్రభుత్వపాఠ శాలల్లో పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద మండలంలోని 46పాఠశా లల అభివృద్ధికి రూ. 1.31 కోట్లు మంజూరు చేసిం దన్నారు. ఇప్పటికే రూ. 32లక్షలు నిధులు కాంట్రా క్టర్లకు అకౌంట్లకు చేరిందన్నారు. ఇచ్చిన గడువు లోగా అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్, ఏఈ వెంకటేష్‌గౌడ్, మండల నోడల్‌ఆఫీసర్ వెంకటాజీ, సీఆర్‌పీలు శంకర్, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

కోయిల్‌కొండ: రాష్ట్రంలో ఆలయాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని నారాయ ణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. గురు వారం మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో నిర్వహించిన కల్యాణమ హోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాలకు ప్రత్యేక నిధులు కేటాయించి మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాన న్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తోందన్నారు. ఆగస్టు 15లోపు సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు రూ. రెండులక్షల రుణమాఫీ చేస్తారన్నారు. కార్యక్రమం లో బ్లాక్ అధ్యక్షుడు వై.విద్యాసాగర్‌గౌడ్, బండియా దవ్‌కుమార్, రవినాయక్, రాముునాయక్, మహేం దర్, సందీప్, శేఖర్, మనోజ్, రామస్వామి, శివా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బుద్ధుడి బాటలో పయనిద్దాం



బుద్ధుడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న కవులు, నాయకులు

వనపర్తి టౌన్: సకల మానవాళి బుద్ధుడి బాటలో నడుస్తూ.. ఆయన చూపిన బాటలో పయనిద్దామని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. ఈ మేరకు గురువారం బుద్ధుడి జయంతిని పురస్క రించుకొని జిల్లా కేంద్రంలోని ఎకో పార్కులో గల బుద్ధుడి విగ్రహానికి టీజేఏసీ ఆధ్వర్యంలో పూలమా లలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజారామ్‌ప్రకాశ్ మాట్లాడుతూ.. వైశాఖ పౌర్ణమి బౌద్ధులకు విశేషమైన రోజని, బుద్ధుడు పుట్టింది, జ్ఞానోదయం అయ్యింది కూడా అదే రోజని గుర్తుచే శారు. జీవకోటికి దశదిశలు ఉపదేశించి, ప్రేమత త్వాన్ని బోధించిన మహనీయుడు బుద్ధుడు అని కొనియాడారు. కార్యక్రమంలో కవులు గిరిరాజాచా రి, డాక్టర్ నాయకంటి నరసింహాశర్మ, ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గంధం నాగరాజు, జానపద కళాకారుల సంఘం అధ్యక్షుడు చీర్ల నాగేంద్రంసాగర్, అఖిలపక్ష ఐక్య వేదిక జిల్లా అధ్య క్షుడు సతీష్‌యాదవ్, నాయకులు బాలేమియా, వెం కటస్వామి, గంధం గట్టయ్య, సాయికుమార్ శర్మ, యాదగిరి చారి తదితరులు పాల్గొన్నారు.

విరిగిన విద్యుత్ స్తంభాలు



పాత కిష్టంపల్లి ఆంజనేయ దేవాలయ రహదారిపై విరిగిపడిన విద్యుత్ స్తంభాలు

అమరచింత: నాలుగు రోజుల కిందట వీచిన ఈదురు గాలులకు పాత కిష్టంపల్లిలో విద్యుత్ స్తం భాలు విరిగిపడినా ఇప్పటి వరకు ట్రాన్స్‌కో అధికా రులు పట్టించుకోవట్లేదు. పాత కిష్టంపల్లి ఆంజ నేయస్వామి ఆలయ ప్రధాన మార్గం ఎదుట ఏర్పాటు చేసిన తోరణ స్తంభంతో పాటు వ్యవ సాయ విద్యుత్ లైన్‌కు సంబంధించిన స్తంభం విరి గిపడింది. విషయాన్ని గమనించిన రైతులు ట్రాన్స్ ఫార్మర్ వద్ద విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. విద్యుత్ స్తంభాలు విరిగిపడి ఆలయం రహదారిపై పడిపోయిందని లైన్‌మెన్‌కు విన్నవించినా పట్టించుకోవట్లేదని బీజేపీ రూరల్ మండల అధ్యక్షుడు హరీష్, ప్రధానకార్యదర్శి మల్లారెడ్డి తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పం దించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

చైల్డ్ హోంకు బాలుడి అప్పగింత



బాలుడిని చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు అప్పగిస్తున్న పోలీసులు

పెబ్బేరు రూరల్: వనపర్తి చేయూత ఆశ్రమంలో ఆడుకుంటూ గేటు బయటకు వచ్చి మరికుంట పరిసరాల్లో తిరుగుతున్న బాలుడిని పోలీసులు వన పర్తి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. పోలీ సులు బాలుడితో వివరాలు సేకరించారు. పెబ్బేరు పట్టణానికి చెందిన గంధం సుధాకర్ కుమారుడు అని తెలియగానే వివరాలు తెలుసుకోగా.. బాలుడి తల్లి చనిపోవడం, తండ్రి పట్టించుకోకపోవడంతో ఆ బాలుడిని వనపర్తి చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు అప్పగించారు. వారు వనపర్తి చేయూత ఆశ్రమంలో విడిచి పెట్టినట్లు వివరించారు. గురువారం ఆ బాలుడిని పోలీసులు వనపర్తి చైల్డ్ వెల్ఫేరు అధికా రులకు అప్పగించారు.

విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

మానవపాడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలెక్టర్ ఆదేశానుసారం ప్రధా నోపాధ్యాయులు శివప్రసాద్ ఆధ్వర్యంలో గురు వారం ఆయా సబ్జెక్టుల వారీగా పదోతరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహి స్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఏ విద్యార్థి ఏ సబ్జెక్ట్‌లో ఫెయిల్ అయినారో, ఆ సబ్జెక్ట్ ఉపాధ్యాయులతో ప్రతిరోజు బోధన అందిస్తున్నామన్నారు. వారం రోజులుగా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామ న్నారు. విద్యార్థులు 100శాతం పదో తరగతి ఉత్తీ ర్ణతే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమం లో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ భవనానికి పూర్వ వైభవం



కంచిరావుపల్లిలో రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి: పాలిటెక్నిక్ కళాశాల భవనానికి పూర్వ వైభవం తీసుకొద్దామని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. గురువారం ఉదయం ఆయన పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో వాకర్స్‌తో కలిసి మార్నింగ్ వాక్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాలలో ఉన్న పురా తన బావికి జాలి ఏర్పాటు చేయడంతో పాటు వాకింగ్ కోసం వచ్చే వారికి ట్రాక్, లైట్లు ఏర్పాటు చేయడంతో అన్ని సమస్యలు పరిష్కరించి అందరి సహకారంతో పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృ షి చేస్తానని తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాల భవన మంజూరు కోసం వచ్చిన నిధులు వెనక్కి వెళ్లకుం డా సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి నిధులను నిలుపు దల చేస్తానన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో యువకులతో కలిసి క్రికెట్, షటిల్, ఫుట్‌బాల్ ఆడారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ పుట్ట పాగ మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణయ్య, చీర్లచందర్, సత్యంసాగర్, బ్రహ్మచారి, డాక్టర్ పగి డాల శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, మన్నెంకొండ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో చెన్నకేశవస్వామి ఉత్సవాలు

పెబ్బేరు రూరల్: చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం మండలంలోని కంచిరా వుపల్లి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గురు వారం చివరి రోజు రథోత్సవంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అర్చకులు చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలు, ఆభరణాలతో అలం కరించారు. అనంతరం మంగళవాద్యాలు, వేదమం త్రోచ్ఛరణల నడుమ చెన్నకేశవ స్వామి రథంపై కొలువుదీరగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి భక్తులతో కలిసి గోవిందనామస్మరణతో రథం లాగారు. రథో త్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి గీతాలాపన చేస్తూ.. మహిళలు కోలా టం, బొడ్డెమ్మ, పలక భజనలు వేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదాలు అం దించారు.

క్రీడలతో మానసికోల్లాసం



మద్దిగట్లలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న తూడి శ్రీనివాస్‌రెడ్డి

కొత్తకోట రూరల్: క్రీడలతో యువతలో మానసికో ల్లాసం వస్తుందని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. పెద్దమందడి మండలంలోని మద్దిగట్లలో ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మండల సమన్వయకర్త తూడి శ్రీని వాస్‌రెడ్డి తల్లిదండ్రులైన వెంకటమ్మ, సాయిరెడ్డి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడతూ క్షణ క్షణం చాలా విలువైందని, యువకులు విలువైన సమయాన్ని బంగారు భవిష్యత్తు కోసం కేటాయిం చాలన్నారు. ఉన్నతమైన చదువులు, క్రీడలతో పాటు తల్లిదండ్రులను దైవంగా భావించాలని సూచించారు. చిన్నప్పటి నుంచి కష్టపడి చదివితేనే భవిష్యత్తులో ఉన్న లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. యువత క్రీడల్లో రాణిస్తే జిల్లా, రాష్ట్ర, జాతీయ, అం తర్జాతీయ గుర్తింపు లభిస్తుందన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమేనని, ఓడిన వారు కుంగిపోకుండా ఎలా గెలువాలో తెలుసుకుని కష్టప డాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రఘుప్రసాద్, సాయిచరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు రానివ్వం



లింగంపల్లిలో కొనుగోలు కేంద్రం పర్యవేక్షణ చేస్తున్న తహసీల్దార్ నాన్యనాయక్

నవాబుపేట: రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ చేసి వారికి బిల్లులు అందించే వరకు అధికారులు పర్యవేక్షణ ఉంటుందని తహసీల్దార్ నాన్యనాయక్ తెలిపారు. కాగా గురువారం సాక్షిలో ప్రచురితమైన వానొస్తే అరిగోసే కథనానికి అధికారులు స్పందిం చారు. జేసీ మోహన్‌రావు, ఇతర అధికారులు మం డల పరిధిలోని లింగంపల్లి, కొల్లూర్ ధాన్యం కొను గోలు కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం బస్తాలు లోడింగ్ చేస్తున్నట్లు వివరిం చారు. ఆలస్యం చేయకుండా వెంటనే తూకాలు చేసి లోడింగ్ చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు.

నిర్మాణ పనులు నాణ్యతగా చేపట్టాలి



పనులను పరిశీలిస్తున్న కాంప్లెక్స్ హెచ్ఎం విష్ణువర్ధన్‌రెడ్డి

పాన్‌గల్: పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టే నిర్మాణం పనులను నాణ్యతగా చేప ట్టాలని పాన్‌గల్ కాంప్లెక్స్ హెచ్ఎం విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని దావాత్‌ఖాన్ పల్లి ప్రాథమిక పాఠశాలలో చేపట్టే నిర్మాణం పను లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వస తుల కల్పనే ధ్యేయంగా చేపడుతున్న మూత్ర శాలలు, మరుగుదొడ్ల నిర్మాణాలు, తాగునీటి వస తి, విద్యుత్ సౌకర్యం వంటి అభివృద్ధి పనులను నిబంధనల మేరకు నాణ్యతగా చేపట్టాలని కాంట్రా క్టర్‌ను ఆదేశించారు. ఆయన పనులను పాఠశాలల హెచ్ఎంలు పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్ర మంలో పాఠశాల హెచ్ఎం మద్దిలేటి, సీఆర్పీ గోవింద్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన

మహబూబ్‌నగర్ రూరల్: అడ్డాకుల మండల కేం ద్రంలో భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసు కున్న రాధిక కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎం.కుర్మయ్య మాట్లాడుతూ అడ్డాకులకు చెందిన రాధికను అదే మండలంలోని తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన ముష్టిగొల్ల రాకేష్ రెండేళ్లుగా ప్రేమించి పెళ్లి చేసుకోవడానికి నిరాకరిస్తే, అమ్మాయి తల్లిదండ్రులు అబ్బాయిని ఒప్పించి మార్చి 24న యాదగిరిగుట్టలో వివాహం జరిపిం చారని తెలిపారు. వివాహం అయిన వారం రోజులు మాత్రమే రాధికను అత్తగారింట్లో ఉంచు కొని.. ఆ తర్వాత పుట్టింటికి పంపించి ఆస్తి, కట్నం కింద డబ్బులు తీసుకురావాలని రాకేష్‌తో పాటు ఆయన తల్లిదండ్రులు వేధింపులకు గురిచేశారని అన్నారు. భర్త రాకేష్, అత్తమామల వేధింపులు తాళలేక మే 18న రాధిక ఆత్మహత్యకు పాల్పడిం దని పేర్కొన్నారు. ఇందుకు అత్తమామలు చం ద్రమ్మ, కృష్ణలపై కేసు నమోదు చేయాలని డిమాం డ్ చేశారు.